
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 24 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589 (309.3558)	69,333	48,214
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.72 (4.12)	2627.64	2328.23
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.80 (45.46)	32,232	28,620

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216

ఒకప్పుడు పంటలకు సాగు దిక్సూచిగా ఉన్న చెరువులు అంతటా ఆక్రమణలకు గురవుతున్నాయి. భూముల ధరలు పెరగడంతో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా చెరువులు ఆనవాళ్లు కోల్పోయి కళ్లెదుటే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం, ప్రజలు పట్టించుకోకపోవడంతో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1,628 చెరువులు, యాదాద్రి జిల్లాలో 1,050, సూర్యాపేట జిల్లాలో 1,026 చెరువులు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువుల శిఖాలు ఆక్రమణకు గురవుతున్నాయి. హైడ్రా వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలతో ఆక్రమణల చెర విడిపించాలని కబ్జాలకు గురవుతున్న చెరువుల ఆత్మఘోషిస్తోంది.

- మిర్యాలగూడ (వ్యవసాయం)



కనుమరుగవుతున్నా..
కనపడటం లేదా?

- వేల ఏళ్ల చరిత్ర కళ్లెదుటే కాలగర్భంలోకి
- మనిషి స్వార్థంతో భవిష్యత్‌కు ప్రమాదం
- కాపాడాల్సిన బాధ్యత పాలకులతోపాటు అందరిదీ
- ఆక్రమణలపై చెరువుల ఆత్మఘోష

భూమి మీద జీవరాశి పుట్టుకతోనే నీటి వనరులకు ప్రాముఖ్యం ఏర్పడింది. ఆదిమానవుడి దశ దాటి ఆహార అవసరాల కోసం ఎప్పుడైతే పంటల సాగు మొదలు పెట్టారో.. అప్పుడే మా పుట్టుక ప్రారంభమైంది. వేల ఏళ్ల క్రితమే మీ పూర్వీకులు మా ప్రాధాన్యాన్ని గుర్తించారు. ప్రజా అవసరాల కోసం వేల సంఖ్యలో చెరువులను తవ్వించారు. మా సహకారంతోనే బంగారు పంటలు పండించుకున్నారు. మేము మానవుని జీవన విధానంలో భాగమయ్యాం. పంటలు బాగా పండినపుడు మమ్మల్ని దైవంగా భావించి ప్రత్యేకంగా పూజలు చేసేవారు. అప్పటి నుంచి కంటికి రెప్పలా మీ పెద్దలు మమ్మల్ని కాపాడుతూవచ్చారు. ప్రతీ ఊరికి మేము అలంకరణగా ఉండే వాళ్లం.జీవరాశుల దాహార్తిని తీర్చే వాళ్లం. ప్రజల్లో మాపై ఎనలేని అభిమానం ఉండేది.



భవిష్యత్ ఎడారే

మమ్మల్ని మీరు చెరపడటంతో నీళ్లు నిలబడటానికి తావు లేకుండా పోయింది. ఎంత వర్షం పడినా ఏటా మీకు నీటి కరువే. ప్రతీసారి దాహంతో అలమటిస్తున్నారు. పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా మీకు ఎలాంటి ప్రాయశ్చిత్తం లేదు. మమ్మల్ని పునరుద్ధరించకపోతే మీ భవిష్యత్ ఎడారిగా మారుతుంది. తస్మాత్ జాగ్రత్త.

పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులదే

స్వార్థపరులు ఆక్రమణలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటుంటే పాలకులు పట్టించుకోకపోగా వత్తాసు పలుకుతున్నారా? పూర్వ కాలంలో రాజులు ప్రజల అవసరాల కోసం, తమ ఆదాయాన్ని వెచ్చించి వేల సంఖ్యలో చెరువులు తవ్వించారు. మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడారు. ఆ రోజుల్లో మా వైపు కన్నెత్తి చూడాలంటే భయపడేవాళ్లు. ప్రస్తుతం సాంకేతికత పెరిగినా, మాలో ఉన్న ఆక్రమణలు ఎందుకు తొలగించడం లేదు? అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మాకు హద్దులు ఏర్పాటు చేసి పూర్వ వైభవం ఎందుకు తీసుకురాలేక పోతున్నారు? పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి మమ్మల్ని కాపాడాలి. లేదంటే మానవాళి భవిష్యత్ అంధకారమే అవుతుంది.

నాగరికతతో విధ్వంసం

నాగరికత పెరిగే కొద్దీ మనిషి ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాడు. డబ్బు మీద కాంక్ష, స్వార్థం, విలువలకు పాతరవేయడంతో మాకు గడ్డు కాలం మొదలైంది. జీవరాశికి మేము ఊపిరి పోస్తే మా ఉసురు తీస్తున్నారు. మీ విలాసాల కోసం మా గుండెల్లో గుణపాలు గుచ్చుతున్నారు. మా చేతులు, కాళ్లు విరిచేశారు. తూములు కూల గొట్టారు. కట్టలు మాయం చేశారు. మా మట్టిని తరలించారు. ఎంత వానొచ్చినా చుక్క నీటిని ఒడిసి పట్టలేని జీవచ్ఛవంలా చేశారు. మా గర్భంలో కాంక్రీటు పోసి క్షోభకు గురి చేయడమేగాక మనుగడను ప్రశ్నార్థకం చేశారు. వరుణుడి ఉగ్ర రూపంతో ఎంత ఉపద్రవం వచ్చినా గుండెల్లో పెట్టుకునే మమ్మల్ని చెరపట్టారు. దీంతో చిన్న చినుకులు పడితేనే అల్లకల్లోలం అవుతూ ఫలితం అనుభవిస్తున్నారు. మా గర్భంలో ఉండాల్సిన వరద రహదారులు, ఇళ్లలోకి ఎందుకు వస్తోంది? ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎందుకు ఆర్తనాదాలు పెడుతున్నారు? ఒక్క క్షణం ఆలోచించండి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వల్లభరావు చెరువులో అక్రమణ నిజమే
నిర్ధారించిన నీటిపారుదలశాఖ అధికారులు

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువు(బతుకమ్మ కుంట) ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనని నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టం చేశారు. శుక్రవారం నీటిపారుదలశాఖ ఏఈఈ శ్రీశైలంతో పాటు రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు వల్లభరావు చెరువును పరిశీలించారు. చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమణలు ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో 'కబ్జా కోరల్లో వల్లభరావు చెరువు' పేరుతో కథనం వెలువడింది. దీనికి స్పందించిన నీటిపారుదలశాఖ అధికారులు చెరువును పరిశీలించారు. చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ప్రీకాస్ట్ సరిహద్దు గోడను అక్రమంగా నిర్మించినట్టు తేల్చారు. నల్లగొండ మండల సర్వేయర్ ద్వారా సర్వే చేయించారు. అక్రమ నిర్మాణాలపై నల్లగొండ మండల రెవెన్యూ అధికారి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వరకు హైడ్రా (విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ) పరిధిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కులు కబ్జాలకు గురికాకుండా నియంత్రించేందుకు హైడ్రాను ఆర్‌ఆర్‌ఆర్ వరకు విస్తరించడమే అన్ని రకాలా శ్రేయస్కరమని పర్యావరణ పరిరక్షణ వేత్తలు ఇప్పటికే ప్రభుత్వానికి ఒక నివేదికను అందజేసినట్టు సమాచారం. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో మాత్రమే ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా పరిధిని ఆర్‌ఆర్‌ఆర్ వర కు విస్తరించే అవకాశాలు ఉన్నాయని ఓ అధికారి తెలిపారు.

- చౌటుప్పల్ టౌన్



ఆర్‌ఆర్‌ఆర్ వరకు
హైడ్రా విస్తరణ!

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- ఆక్రమణల నుంచి చెరువులను కాపాడేందుకే

జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా చర్యలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుండడంతో ఆర్‌ఆర్‌ఆర్ వరకు హైడ్రా పరిధిని విస్తరించి చెరువులు, కుంటలు, బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించి పటిష్ట ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రభుత్వం సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. చెరువులు, కుంటలు అక్రమార్కుల చేతిలో కరిగిపోతుండడంతో వర్షపు నీటి నిల్వలు ఉండలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో భూగర్భ జలాలు పడిపోయి కరువు, కాటకాలు తలెత్తుతున్నాయి. నాలాలపై చేసిన అక్రమ నిర్మాణాలతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద ముందుకు వెళ్లలేక ఇళ్లలోకి చేరుతోంది. వరదతో పాటు మురుగు సైతం ఇళ్లను ముంచెత్తుతోంది.

చౌటుప్పల్ సమీపంలో ఆర్‌ఆర్‌ఆర్ కూడలి

చౌటుప్పల్‌లోని 65వ నంబరు జాతీయ రహదారిపై 55వ కిలోమీటరు రాయి వద్ద నుంచి ఆర్‌ఆర్‌ఆర్ క్రాస్ వెళ్తుంది. ఈప్రాంతంలో ఇంటర్‌చేంజ్ జంక్షన్(కూడలి)ను ఏర్పాటు చేయనున్నారు.పట్టణం నుంచి రెండు కిలోమీటర్లు దాటిన తరువాత విజయవాడ వైపునకు ఈజంక్షన్ ఏర్పాటు కానుంది. ఈ ఆర్‌ఆర్‌ఆర్ జంక్షన్ వరకు హైడ్రాను విస్తరించేందుకు సంబంధిత అధికారులతో కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

ఆక్రమణలపై దృష్టి సారించిన హైడ్రా

పట్టణంలోని ఊర చెరువు, నాగుల కుంటల్లో జరిగిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టి సారించినట్టు సమాచారం. ఆర్‌ఆర్‌ఆర్ వరకు హైడ్రాను విస్తరించనున్న నేపథ్యంలో శిఖం భూములతో పాటు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలపై సంబంధిత అధికారులు పూర్తి సమాచారాన్ని సేకరించడంలో నిమగ్నమైనట్టు తెలిసింది. హైడ్రా సాగిస్తున్న ఆక్రమణల తొలగింపు చర్యలను గమనిస్తున్న అక్రమ కట్టడాల యజమానుల గుండెలో దడ మొదలైంది. ఇప్పటికే మండలం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండడంతో మాస్టర్ ప్లాన్‌ను హైడ్రా అధికారులు పరిశీలిస్తున్నారు.

హెచ్‌ఎండీఏ అధికారులతో హైడ్రా చర్చలు సాగిస్తోంది. మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన నిబంధనలను అతిక్రమించి, చేపట్టిన కట్టడాలపై తగిన సమాచారాన్ని సేకరించడంలో హైడ్రా నిమగ్నమైంది. ఈ సమాచారం విషయంలో హైడ్రా చాలా గోప్యతను పాటిస్తుండడంతో ఆక్రమార్కులు భయపడుతున్నారు. ఇప్పటికే అక్రమార్కులు ఒక అడుగు ముందుకేసి అటు హైడ్రా అధికారులు, ఇటు హెచ్‌ఎండీఏ అధికారులతో కచ్చితమైన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

కొనసాగుతున్న ఆక్రమణల పర్వం

చౌటుప్పల్ పట్టణంలో ఊర చెరువు, నాగుల కుంటలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారంగా సర్వే నంబరు 363లో ఊర చెరువు శిఖం 33.37ఎకరాలు, సర్వే నంబరు 322లో నాగుల కుంట శిఖం భూమి 11.32ఎకరాల మేర ఉంది. కాగా, ప్రస్తుతం ఈ భూమి చాలా వరకు ఆక్రమణలకు గురైంది. శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఊర చెరువులో అలుగు ప్రాంతంలో అక్రమ కట్టడాలు వెలిశాయి. చెరువు నిండిన సమయంలో అలుగు నీరు బయటికి వెళ్లలేక కట్టకు ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నాగుల కుంట పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. శిఖం భూమి సగం మేరకు ఆక్రమణకు గురైంది. పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. ఈ చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధి రోజు రోజుకూ కుంచించుకుపోతోంది. నకిలీ పత్రాలతో శిఖం భూముల్లో అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. వందల కోట్ల రూపాయల విలువైన శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో నాలుగు ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో కేటాయించిన బఫర్ జోన్‌లో కూడా నిర్మాణాలు ఉన్నాయి.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



సీపీఎస్ రద్దు కోరుతూ నల్లగొండలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

•8లో..

'దేవుళ్ల యాత్ర'తో రాజకీయ దుమారం

- గుట్ట వేదికగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల ప్రచ్ఛన్న యుద్ధం
- దేవాదాయ నిబంధనలు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఉల్లంఘించారని, కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేయాలని డీసీపీకి ఫిర్యాదు
- పోటాపోటీ ఫిర్యాదులతో వేడెక్కిన రాజకీయం



ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతోపాటు కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్రకు ఫిర్యాదు చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, తదితరులు

యాదాద్రి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ విషయంలో మాట తప్పారంటూ మాజీ మంత్రి హరీ‌శ్‌రావు చేపట్టిన దేవుళ్ల యాత్రతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వేదికగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య రాజకీయపరంగా ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతోంది. ఇరుపార్టీల నేతలు ఒకరిపై ఒకరు పోటాపోటీగా కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఓ పూజారితో పూజలు నిర్వహించిన హరీ‌శ్‌రావుతోపాటు పలువురిపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట పోలీ‌స్‌స్టేషన్‌లో ఆలయ ఈవో భాస్కర్‌రావు ఫిర్యాదుచేశారు. ఈవో ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి హరీ‌శ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, తదితరులపై కేసులు నమోదుచేశారు. అయితే యాదగిరిగుట్ట ఆలయాన్ని మాజీ మంత్రి హరీ‌శ్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ నేతలు అపవిత్రం చేశారని, ఆలయ మాడవీధులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతోపాటు కాంగ్రెస్ నేతలు ట్యాంకర్ల నీటితో శుద్ధి చేశారు. పవిత్రమైన ఆలయంలో కాంగ్రెస్ నేతలు నీటి ట్యాంకులతో శుద్ధి చేయడమేంటని, రాజకీయపరంగా శుద్ధి చేసిన ఎమ్మెల్యేతోపాటు ముఖ్య నాయకులపై కేసులు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదయ్యాయి. దీంతో కాంగ్రెస్ నేతలు కూడా చేసింది రాజకీయపరంగానే ఆలయ మాడవీధుల్లో శుద్ధి చేశారని, వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇరుపార్టీల నేతలు పోటాపోటీగా ఆందోళనలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే బీర్లపై డీసీపీకి ఫిర్యాదు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, యాదగిరిగుట్ట మాడవీధులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతోపాటు పలువురు నేతలు శుద్ధి చేయడంపై చర్యలు తీసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్‌నేతలు శుక్రవారం డీసీపీ రాజే‌శ్‌చంద్రకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పర్యటన అనంతరం, సాయంత్రం 4.15 గంటలకు మాడవీధుల్లో ప్రజాప్రతినిధులు నడిచిన ప్రాంతాల్లో బీర్ల అయిలయ్య తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు కొండకింద భాగంనుంచి ఐదు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లకు ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకొచ్చి... రాజకీయ పరమైన శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట దేవాలయ నియమ నిబంధనల ప్రకారం సూర్య, చంద్రగ్రహణాలు వచ్చినప్పుడు, ఆలయ పరిసరాల్లో మరణాలు సంభవించినప్పుడు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకుల పూజలతో చేస్తారని పేర్కొన్నారు.

అర్చకుల పూజలతో దేవాలయ సిబ్బంది చేపట్టడం ఆగమ శాస్త్ర సంప్రదాయం... రాజకీయ నాయకులు శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టడం దేవాదాయ, ధర్మాదాయ నియమ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదుచేశారు. దేవాలయ పరిసరాల్లో రాజకీయ కార్యక్రమాలు చేపట్టడంవల్ల కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, దేవాలయం పరిధిలో రాజకీయ కార్యక్రమంతో శుద్ధి చేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. డీసీపీకి వినతిపత్రం సమర్పించిన వారిలో బీఆర్‌ఎస్ నేతలు కర్రె వెంకటయ్య, తోటకూరి బీరయ్య, పాట్ల నరహరి, గడ్డమీద రవీందర్ గౌడ్, ఇమ్మడి రాంరెడ్డి, తదితరులున్నారు.

డ్రగ్స్‌కు బానిసై జీవితాలను
నాశనం చేసుకోవద్దు

- కామినేని మెడికల్ కళాశాలలో 'మిషన్ పరివర్తన్'
- ర్యాగింగ్‌కు పాల్పడినా నేరమే
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నార్కట్‌పల్లి కామినేని వైద్య కళాశాలలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 23: మాదక ద్రవ్యాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. క్షణకాలం ఆనందం కోసం జీవిత కాలపు విషాదాన్ని దరిచేరనివ్వద్దని హితవు పలికారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా శుక్రవారం సాయంత్రం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని కామినేని వైద్య విద్యా కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియాపై మెడికోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీస్ శాఖ చేస్తున్న యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయివంటి మత్తు పదార్థాల బారిన పడితే కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులను మోసం చేసినట్టేనన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేసినా, విక్రయించే వారే స్థాయిలో ఉన్నా ఉపేక్షించలేది లేదని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడటం కూడా అనాగరిక చర్యగా పేర్కొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమన్నారు. ఇన్‌స్టాగ్రాం, సోషల్ మీడియా పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు దగ్గరై నష్టపోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చున పడిన వారెవరైనా బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో మహిళల రక్షణకోసం ఏర్పాటు చేసిన షీ టీంలు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు, కాలేజీ, ఆస్పత్రి సిబ్బందితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో జిల్లా అదనపు పోలీస్ అధికారి రాములు నాయక్, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, షీ టీం ఇన్‌చార్జి సీఐ కరుణాకర్, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, మెడికల్, డెంటల్ కాలేజీ ప్రిన్సిపల్స్ బాబా సాహెబ్ కాడగి, మహేశ్, అకాడమిక్ డాక్టర్ సుధీర్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్ రామ్మోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల పురోభివృద్ధికి కృషి

- గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న రియాజ్

నల్లగొండ, చిట్యాలరూరల్, ఆగస్టు 23: రాష్ట్రంలోని గ్రంథాలయాల పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్ అన్నారు. జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సన్మాన కార్యక్రమంతోపాటు చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రంథాలయం, సమాచార కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని చెప్పారు. పేద, సామాన్య, ధనిక తేడా లేకుండా అందరికీ సమానంగా గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించి, గ్రంథాలయాలకు పేరు తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం అహర్నిశలు పని చేస్తుందని, అందులో భాగంగానే జాబ్ క్యాలెండర్ ప్రకటించిందన్నారు. నిరుద్యోగులు నిత్యం కఠోర శ్రమ చేస్తూ ఉద్యోగ సాధనకు పాటుపడాలన్నారు. ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామని, మరేవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాకేంద్ర గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జి పూర్ణచంద్ర మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రంథాలయాల పాత్ర విశిష్టమైందన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏవీఎన్ రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల నిర్వహణలో నల్లగొండ గ్రంథాలయం ముందంజలో ఉంటుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, వేణుగోపాల్, ఎల్ఎన్ రెడ్డి, శ్రవణ్‌కుమార్, నర్సింహారెడ్డి, కట్టా నాగయ్య, కుసుమశ్రీ, పాఠకులు నీలం వెంకన్న, శివకుమార్, చందు, లింగస్వామి, చిట్యాల మండలంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మణాచారి, అంజయ్య, శ్రీనివాస్, శివలింగం, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

కొండపైన ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 23 : శ్రీయాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి స్వర్ణపుష్పార్చాన అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమణ శాస్త్రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు స్వయంభులను మేల్కొవి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకారమండపంలో హోమం, నిత్యకళ్యాణం, సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు ముత్యాలు బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. మంగళవాయిద్యాలు మహిళా భక్తుల మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు కొనసాగాయి. యాగశాలలో చండీహోమం చేపట్టారు. ఆలయ ఖజనాకు వివిధ విభాగాల నుంచి రూ.14,71,500ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ భాస్కర్‌రావు తెలిపారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందన్నారు.



ఆలయంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జిల్లా ఉపాధి కల్పనాధికారి సరెండర్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 23: సూర్యాపేట జిల్లా ఉపాధి కల్పనాధికారి అక్బర్ హబీబ్‌ను డైరెక్టర్ ఆఫ్ ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి సరెండర్ చేస్తూ శుక్రవారం ఆ జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అనంతరం సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేరడ ప్రాథమిక పాఠశాలలో పాము కలకలం



చిట్యాలరూరల్, ఆగస్టు 23: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామం ఎస్సీకాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాము కలకలం సృష్టించింది. పాఠశాలను శుభ్రపరిచేందుకు ఉదయం తరగతి గదిలోకి స్వీపర్ యాదయ్య వెళ్లగా అందులో పాము కనబడిందది. స్వీపర్ భయాందోళన చెంది బయటకు పరుగులుతీశాడు. పాఠశాలలోని తరగతి గదిలోకి పాము వచ్చిన విషయాన్ని స్థానికులకు తెలపడంతో వారు వచ్చి పరిశీలించారు. ఓ యువకుడు వచ్చి పామును కర్రతో కొట్టి చంపాడు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

కనగల్, ఆగస్టు 23 : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ట్రాక్టర్ల బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మండలంలోని ఇస్లాంనగర్, కేబీతండాలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన ఏడు ట్రాక్టర్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఇస్లాంనగర్‌లో ఐదు, కేబీ తండాలో రెండు రెండు చొప్పున బ్యాటరీలు చోరికి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఇస్లాంనగర్‌లో బైక్ దగ్ధం


ఇస్లాంనగర్‌లో శుక్రవారం ఓ బైక్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎస్‌కే బాబా పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లగా ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పటించినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బాధితుడు కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, తెలంగాణ ఉద్యమకారులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు పొన్న మోని శ్రీశైలం డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం 250 చదరపు గజాల స్థలాన్ని కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎంతోమంది ఉద్యమకారుల త్యాగ ఫలితంగా నేడు రాష్ట్ర ఏర్పడిందన్నారు. టీఆర్‌ఎస్‌ను కేసీఆర్ బీఆర్‌ఎస్‌గా మార్చడంతోనే తెలంగాణ ఉద్యమకారుల్లో నిరాశ అలుముకుందన్నారు. పార్టీ పతనం అప్పటి నుండే ఆరంభమైందన్నారు. నిజమైన కార్యకర్తలను గుర్తించకపోవడంతోనే పార్టీ నిస్తేజంగా మారిందన్నారు.

ప్రముఖ దేవాలయాల ట్రస్ట్‌బోర్డులకు నోటిఫికేషన్

- యాదాద్రి, చెర్వుగట్టు, మట్టపల్లి, ఆందోళ్‌మైసమ్మ, మత్స్యగిరి ఆలయాలకు..
- 20 రోజుల్లోగా ఆసక్తి అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆదేశం



రెండేళ్ల తర్వాత

నార్కట్‌పల్లి, ఆగస్టు 23: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రముఖ క్షేత్రాల ట్రస్ట్‌బోర్డులకు నోటిఫికేషన్ విడుదలైంది. దేవస్థానంలో ధర్మకర్తల మండలి ఏర్పాటుకు అనుమతిస్తూ జీవో నెంబర్ 299ని శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ జారీ చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంతో పాటు యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, వలిగొండ మండలం వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, చౌటుప్పల్ మండలంలోని ఆందోళ్ మైసమ్మ దేవస్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి 20 రోజుల్లోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు ట్రస్టు బోర్డు సభ్యులుగా దరకాస్తు చేయాలని సూచించారు. ట్రస్టు బోర్డు మెంబర్ దరఖాస్తులను నిర్ణీత నమూనాలో శాఖ కమిషనర్, డైరెక్టర్, లేదా జాయింట్ కమిషనర్, సంబంధిత ఆలయాల పరిధికి సంబంధించిన సహాయకమిషనర్ కార్యాలయాల్లో అందజేయవచ్చని పేర్కొన్నారు.

ఇదిలాఉండగా గత పాలకవర్గ పదవీకాలం ముగిసిన రెండేళ్ల తర్వాత చెర్వుగట్టు దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటుకానుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2021 జనవరి 3న మేకల అరుణారాజిరెడ్డి చైర్‌పర్సన్‌గా నియమితులైన ధర్మకర్తల మండలి రెండేళ్ల పాటు కొనసాగింది. ఇందులో మొదటి సంవత్సరం మాత్రమే ట్రస్టుబోర్డుగా వ్యవహరించగా రెండో ఏడాది మాత్రం అభివృద్ధి కమిటీగానే సేవలందించింది. ఆ కమిటీ పదవీకాలం 2023 జనవరి 3తో ముగిసినా అప్పటి రాజకీయసమీకరణలు, పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య పెరిగి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కొత్త కమిటీని వేయలేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ వరుస ఎన్నికలు రావడంతో ట్రస్టు బోర్డు వేయటానికి ప్రభుత్వానికి కుదరలేదు. ఇప్పటికైనా ట్రస్టు బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న శేఖర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఆగస్టు 23: చెర్వుగట్టు దేవస్థాన ప్రతీ ఉద్యోగి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి మండలంలోని చెర్వు గట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతల్లో భాగంగా శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. తొలుత ప్రధానాలయంలో స్వామి వారి దర్శనం అనంతరం గుట్టపై ఉన్న ఇతర ఉపాలయాలను దర్శించారు. ఆలయవిభాగాల్లో ప్రధానమైన కల్యాణకట్ట, ప్రసాదాలతయారీ, నిత్యాన్నదానసత్రం, అర్చన టికెట్ల జారీ కౌంటర్లను తనిఖీ చేశారు.నిత్యావసరాల వస్తువుల నాణ్యతను పరిశీలించారు. గుట్టపై టెండర్ల ద్వారా వ్యాపారాలు చేస్తున్న వారిని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. గుట్టపై అనధికారికంగా స్టాల్‌లు అద్దెకిస్తున్న వారిని ప్రశ్నించారు. గుట్టపై నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించి వాటి పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఈవో కార్యాలయంలో దేవస్థాన సిబ్బంది, ఆలయ అర్చకులతో సమావేశమయ్యారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతీ రోజూ విధిగా సమయ పాలనతో పాటు ప్రతీ ఒక్కరూ డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. సమావేశంలో ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఉద్యోగులు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, రాజ్యలక్ష్మి, నర్సిరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

ఉద్యోగుల పాలిట శాపంగా సీపీఎస్ విధానం

- గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఆగస్టు 23న ఓపీఎస్ విధానానికి స్వస్తి
- పెన్షన్ విద్రోహ రోజును సీపీఎస్ విమోచన దినోత్సవంగా ప్రకటించాలంటూ డిమాండ్



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సీపీఎస్ జీవో పత్రాలను దహనం చేస్తున్న ఉద్యోగులు

నల్లగొండ టౌన్,ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయులకు కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) శాపంగా మారింది. రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ లేక వృద్ధాప్యంలో భద్రత లేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక ఒత్తిడికి గురై తుదిశ్వాస విడుస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా సేవలందించిన ఉద్యోగికి పెన్షన్ లేకపోవడం వారిని బాధిస్తోంది. ఈ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ఆధ్వర్యంలో దశాబ్దకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. 2014 ఆగస్టు 23న కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం రహస్యంగా జీవో 28 ద్వారా సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకుంది. దీంతో ఆగస్టు 23ను సీపీఎస్ ఉద్యోగుల పాలిట చీకటి దినంగా(బ్లాక్ డే) సంఘాలు నిరసన కార్యక్రమలు నిర్వహిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసినట్లుగానే రాష్ట్రంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెన్షన్ విద్రోహదినమే సీపీఎస్ విమోచనదినంగా మారాలి



ప్రస్తుత ప్రభుత్వంలో సీపీఎస్ విద్రోహ దినమే విమోచన దినంగా మారాలి. మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమాలను గౌరవిస్తాడనుకుంటే ధర్నా చౌక్ ఎత్తివేసి ఉద్యోగులను మోసం చేశాడు. ఆయన తీరుతోనే గత ప్రభుత్వాన్ని ఓడించాం. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సీపీఎస్‌పై స్పష్టమైన హామీ ఇవ్వడంతో సీపీఎస్ ఉద్యోగ కుటుంబాలు ఓట్ ఫర్ ఓపీఎస్ విధానంతో కాంగ్రెస్‌కు మద్దతిచ్చి గెలిపించుకున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం సీపీఎస్ విధానాన్ని ఎత్తివేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి.

- నాగవెల్లి ఉపేందర్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

రిటైర్మెంట్ అనంతరం భద్రతా లేదు



ప్రభుత్వ ఉద్యోగమంటే భద్రత భరోసా ఉంటుందని కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాం. సీపీఎస్‌తో రిటైర్మెంట్ అనంతరం వృద్ధాప్య జీవితానికి భద్రత లేకుండాపోతోంది. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సర్వీసు అందించాం. ఇలాంటి ఎన్ని విపత్తులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొవడానికి సిద్ధగా ఉన్నాం. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ప్రకటన కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

-భూలక్ష్మీ, సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా కన్వీనర్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఆదుకోవాలి



ఉద్యోగుల పక్షపాతి అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇచ్చి, బదిలీలు పూర్తిచేయడం అభినందనీయం. అదేవిధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి 2.5 లక్షల సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి. కొత్తపెన్షన్ ఉద్యోగుల పాలిట చీకటి రోజు. తెలంగాణ ఉద్యమ పార్టీ చేసుకున్న ఒప్పందంతో ఉద్యోగులను అగాధంలోకి నెట్టారు. ఉద్యోగుల దోస్తీ అనిచెప్పి, ఉద్యోగులను నిండా ముంచారు.

- రామదాసు, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం

పాత పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నాం



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులంతా పాత పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందంటూ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం పెంచి రెట్టింపు ఉత్సాహంతో పని చేసేలా ప్రోత్సహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల హృదయాల్లో నిలిచారు. అదే స్ఫూర్తితో సీపీఎస్ విధానాన్ని కూడా రద్దు చేయాలి.

- లావూరి బాలు, ఎంఈవోఓల సంఘం గౌరవాధ్యక్షుడు

నీటి సంపులో పడి యువకుడు మృతి



దుర్గాప్రసాద్(ఫైల్)

శాలిగౌరారం, ఆగస్టు 23 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో సంపులో పడి యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మార్కెట్ కాలనీకి చెందిన కంది వెంకన్న(అలియాస్ చంద్రబాబునాయుడు) కూలీనాలీ పనిచేస్తుంటాడు. కుమారుడు దుర్గాప్రసాద్(17), కుమార్తె దివ్య ఉన్నారు. వెంకన్న భార్య నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె శాలిగౌరారంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. కుమారుడు దుర్గాప్రసాద్(17)కు కొంతకాలం నుంచి అప్పుడప్పుడు మూర్ఛ వస్తోంది. ఇటీవలే పదో తరగతిలో పాస్‌అయ్యాడు. చదువుకునే ఆర్థిక పరిస్థితి లేక ఇంటి వద్దనే ఉండుకుంటూ కూలీ పని చేసుకుంటూ, ఇంటి పనులు చేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి వెంకన్న పనినిమిత్తం బయటకు వెళ్ల ఇంటి ముందు ఉన్న నీటి సంపు వద్ద పనిచేస్తుండగా ఫిట్స్ వచ్చి సంపులో పడి అక్కడికక్కడే మరణించాడు. కొద్ది సేపటి తర్వాత పక్క ఇంటివారు గమనించి తండ్రి వెంకన్నకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకొని కుమారుడు విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన వెంకన్న గుండెలు బాదుకుని రోదించాడు. నాలుగేళ్లలో భార్యను, కుమారుడిని పోగొట్టుకున్నానని, రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. దుర్గాప్రసాద్ అకాల మృతికి గ్రామస్థులు చాడ రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి బ్రదర్స్ విచారం వ్యక్తం చేయడంతో పాటు రూ.10వేలు, గురజాల మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ రూ.3వేల ఆర్థికసాయం చేశారు.

బ్యాంకులో గుండెపోటుతో రైతు..



గోపాల్(ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 23 : యాదాద్రిభువనగిరి జిల్లాలో బ్యాంక్‌కు పనినిమిత్తం వచ్చిన రైతు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక ఆర్‌ఎంపీ సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్కలేదు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం మునిపంపుల యూనియన్ బ్యాంక్‌కు పనినిమిత్తం మండలంలోని ఇస్కిళ్ల గ్రామానికి చెందిన పొలిమేర గోపాల్(72) శుక్రవారం వచ్చాడు. తన ఖాతాల్లో డబ్బులు కుమారుడి ఖాతాలోకి మార్చాడు. బ్యాంక్ లో ఉండగానే గోపాల్ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. దగ్గరలోని ఆర్‌ఎంపీ వచ్చి సీఆర్‌పీ చేసినా ప్రాణాలు దక్కలేదు. గోపాల్‌కు భార్య నర్సమ్మతో పాటు ఐదుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ...

కనగల్, ఆగస్టు 23 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన మామిడి ఎల్లయ్య ఇదేగ్రామానికి చెందిన మామిడి సైదులు, మాతంగి ప్రసాద్ కలిసి గురువారం దర్వేశీపురం స్టేజీ వద్ద జరిగిన పెళ్లి వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో వీరి బైక్ చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య శుక్రవారం మృతి చెందారు. ఎల్లయ్య కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో బాలిక...

మునుగోడు రూరల్, ఆగస్టు 23 : అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందింది. ఈ ఘటన నల్లగొండ మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో వెలుగుచూసింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి లాలు, ధనమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె చందన ఉన్నారు. ఏడాదిన్నర కిందట లాలు మృతి చెందారు. తల్లి కూలీనాలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. కుమార్తె చందన(17) మునుగోడులోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్య అభ్యసిస్తోంది. 10 రోజుల కిందట ఇంటికి వచ్చింది. తల్లి కూలీ పనులకు వెళ్లడంతో కుమార్తె ఇంటి వద్దే ఉంది. కూలీకి వెళ్లి ఇంటికి వచ్చే సరికి కుమార్తె నోటి వెంట నురుగులు కక్కుతూ అనుమానాస్పదస్థితిలో మృతి చెంది కనిపించింది. చందన మృతి కారణాలు తెలియాల్సి ఉందని, ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఒకరు..

నల్లగొండ క్రైం, ఆగస్టు 23 : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాగర్ రోడ్డులో చోటుచేసుకుంది. నల్లగొండ వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కనగల్ మండలం యాచారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి(45), తొరగల్ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి కలిసి బైక్‌పై సాగర్ రోడ్డు నుంచి నల్లగొండకు వస్తున్నారు. అదే క్రమంలో నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు నేషనల్ ఫంక్షన్‌హాల్ ప్రాంతానికి చెందిన రేవల్లి నాగరాజు నల్లగొండ నుంచి సాగర్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రెండు బైకులు ఎదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్స్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వెంటనే సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తన వాహనంలో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో రవీందర్‌రెడ్డి మృతి చెందగా వెంకటరెడ్డి, రేవల్లి నాగరాజు పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని సీఐ పరిశీలించారు.

చేతబడి నెపంతో వృద్ధుడిపై దాడి

దామరచర్ల, ఆగస్టు 23 : చేతబడి నెపంతో వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన జానకి కొండయ్య అనే వృద్ధుడిపై అదే గ్రామానికి చెందిన నరసింహారావు తమ కుటుంబానికి చేతబడి చేస్తున్నాడని అనుమానం పెంచుకున్నాడు. ఇటీవల అతడి గేదె పాలివ్వకపోవడంతో కొండయ్య చేతబడి చేయడంతోనే గేదె పాలివ్వడం లేదని అనుమానించాడు. ఈ క్రమంలో నరసింహారావు, అతడి భార్య మంగమ్మతో పాటు వారి కుమార్తె కలిసి కొండయ్యపై దాడి చేసి గాయపరిచారు. కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుమలగిరి ఘర్షణలో 12 మందిపై కేసు నమోదు

తిరుమలగిరి, ఆగస్టు 23 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో గురువారం జరిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఘర్షణకు సంబంధించి 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ నుంచి ఆరుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. వీడియోఫుటేజ్ ఆధారంగా దాడికి పాల్పడిన వారిని గుర్తించి, మరికొందరిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామన్నారు.

నల్లగొండ ఆర్డీవో కార్యాలయ స్థలం వేలం వాయిదా

నల్లగొండ, ఆగస్టు 23: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ ఖాళీ స్థలం వేలం వాయిదాపడింది. ఆ స్థలాన్ని వేలం వేసి పరిహారం చెల్లించాలన్న కోర్టు ఆదేశాలతో అధికారులు, ఉద్యోగులకు సమస్యలు ఎదురవుతున్నాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్లు రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ఫ్లైఓవర్ వరకు ఓ వ్యక్తికి సంబంధించిన 1,300 గజాల స్థలాన్ని 2013లో వరద కాల్వ నిర్మాణం కోసం మునిసిపల్ అధికారులతో పాటు ఆర్డీవో కార్యాలయ అధికారులు భూసేకరణ చేపట్టారు. ఈ భూసేకరణకు సంబంధించి ఒక్కో గజానికి రూ.2500చొప్పున చెల్లించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ఆ ప్రాంతంలో అధిక రేటు ఉన్నప్పటికీ భూయజమాని మాత్రం సంబంధిత ప్రాంతంలోని మార్కెట్ ధర ప్రకారం రూ.5వేలు చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 2018లో కోర్టు కూడా వడ్డీతో సహా కలిపి రూ.1కోటి70లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అయితే అధికార యంత్రాంగం జిల్లా కోర్టు తీర్పుపై హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు స్టే ఇవ్వడంతో పాటు 50శాతం సంబంధిత యజమానికి చెల్లించాలని పేర్కొంది. ఈ విధంగా మూడు సార్లు స్టే రావడంతో సదరు భూయజమాని నాంపల్లిలోని ల్యాండ్ అక్విజేషన్ అథారిటీని ఆశ్రయించడంతో 2023 నవంబరులో నల్లగొండ ఆర్డీవో కార్యాలయాన్ని అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఆర్డీవో కార్యాలయంలోని 1,100 గజాలను వేలం వేసి సంబంధిత భూ యజమానికి పరిహారం చెల్లించాలని పేర్కొనడంతో పాటు ఈ నెల 23న వేలం వేయాలని గత నెలలో ఆదేశాలు ఇచ్చింది. దీంతో శుక్రవారం వేలం ప్రక్రియను నిర్వహించడానికి నిర్ణయించిన సమయంలో 11మంది బిడ్డర్లు హాజరయ్యారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ భూయజమానితో సంప్రదింపులు చేసి కొంత సమయం కోరినట్లు తెలిసింది. అయితే సెప్టెంబరు 23వరకు పరిహారం చెల్లించేలా అంగీకారానికి రావడంతో వేలంను వాయిదా వేసినట్లు సమాచారం. ఈ విషయంపై నల్లగొండ ఆర్డీవో రవిని వివరణ కోరగా, వేలం వాయిదా వేయడం జరిగిందన్నారు. మొత్తానికి నల్లగొండ మునిసిపాలిటీకి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కమిషనర్ పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ జ్యాపం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. ల్యాండ్ అక్విజేషన్ బాధ్యత ఆర్డీవోకు ఉండటంతో మునిసిపాలిటీ అధికారులు చేసిన తప్పిదానికి ఆర్డీవో కార్యాలయం స్థలం వేలానికి రావడంపై పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

అన్నిపథకాలను ఒకే గొడుగు కిందకు తేవాలి

- నాబార్డ్ చైర్మన్‌కు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి



ముంబైలో నాబార్డ్ చైర్మన్ సాజీకి బొకేను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 23 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సహకార రైతులందరికీ సబ్సిడీలు సులభతరంగా అందేందుకు ఎస్ఎల్ఎం, ఎన్‌హెచ్‌బీ, ఎన్‌హెచ్‌ఎం, డీఎంఐ వంటి పథకాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకవచ్చేలా నిర్ణయాలు తీసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాబార్డ్ చైర్మన్ కేవీ సాజీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మహారాష్ట్రలోని ముంబైలో నిర్వహించిన జాతీయ నాబార్డ్ మీటింగ్‌కు హాజరైన సందర్భంగా పలు అంశాలను చైర్మన్ సాజీ దృష్టికి తీసుకెళ్లారు. సబ్సిడీ పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయడానికి పోర్టల్ సరిగా పనిచేయడం లేదన్నారు. నాబార్డ్‌కు సబ్సిడీ పత్రాలను అప్‌లోడ్ చేయడానికి మొదటి రుణ పంపిణీ తేదీని మూడు నెలల నుంచి ఆరు నెలలకు పెంచాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం గోదాంల అవసరం ఉన్నందున నిర్మాణాలను ప్రోత్సహించడానికి సబ్సిడీలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్‌ల కింద స్థాపించిన ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు, గిడ్డంగులకు సబ్సిడీలు అందించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి డీసీసీబీల సహాయంతో నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎస్‌పీ కింద వరి ధాన్య సేకరణ మాదిరిగా పప్పుధాన్యాల సేకరణ ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులను ప్రభుత్వానికి సరఫరా చేయడానికి డీసీసీబీల ద్వారా ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం నాబార్డ్ చైర్మన్ కేజీ సాజీ మాట్లాడుతూ నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తమ దృష్టికి తీసుకవచ్చిన అంశాలను పరిశీలించి సహకార వ్యవస్థ బలోపేతం కోసం సహకరిస్తామన్నారు.

రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి..

- అక్రమ రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్
- ఇరువురిపై రౌడీషీట్ నమోదు
- 400 క్వింటాళ్ల బియ్యం, రెండు వాహనాలు స్వాధీనం



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ, ఆగస్టు 23 : అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని రైస్‌మిల్లు ద్వారా నూకలుగా మార్చి ట్రేడింగ్ లైసెన్స్‌లు కలిగిన వారి వద్ద పత్రాలు తీసుకుని బేవరేజ్ కంపెనీలకు విక్రయిస్తున్న తొమ్మిది మంది ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న మిర్యాలగూడ పట్టణ శివారులోని జంకుతండాలో శ్రీలక్ష్మీ మినీ ప్యాడీ రైస్‌మిల్ వద్ద లారీ, డీసీఎంలో రేషన్ బియ్యం ఉన్నాయనే సమాచారంతో రూరల్ పోలీసులు వాహనాలు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారన్నారు. జంకుతండాకు చెందిన ధనావత్ నరేందర్, ప్రకాశ్‌నగర్‌కు చెందిన రమావత్ శ్రీను, వెంకటాద్రి పాలెం ధీరావత్ సోని, గోగువారిగూడెం ఊట్ల వెంకటేశ్వరరావు, ఇందిరమ్మ కాలనీ పసుమర్తి నాగేశ్వరావు, తుంగపాడ్‌కు చెందిన రేషన్‌డీలర్ బీర్ల వెంకట్‌రెడ్డి రేషన్ బియ్యం కొనుగోలు చేసే వారి వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి శ్రీలక్ష్మీ మిల్లులో పాలిష్‌పట్టి నూకలుగా మార్చేవారు. అనంతరం ట్రేడింగ్ లైసెన్స్‌లు కలిగిన పోతుగంటి శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాస్, పీ రాములు అనే వ్యక్తుల వద్ద నుంచి పేపర్లు తీసుకుని నూకులగా మార్చిన బియ్యాన్ని హైదరాబాద్ ట్రేడింగ్ మార్కెట్‌కు రవాణా చేసేవారు. వారు అక్కడి నుంచి బేవరేజి కంపెనీలకు పంపిస్తారని విచారణలో వెల్లడైందన్నారు. ధనావత్ నరేందర్‌నాయక్‌పై గతంలో రూరల్ పీఎస్‌లో రెండు పీడీఎస్ కేసులు ఉన్నాయని తెలిపారు. అతడి వద్ద అప్పట్లో రెండు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయడం మానకపోవడంతో నరేందర్‌నాయక్‌తో కలిసి గతంలో పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యం వ్యాపారీ రమణ అనే వ్యక్తిపై రౌడిషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. గతంలో రేషన్ బియ్యం అక్రమవ్యాపారంలో పట్టుబడిన వ్యక్తులు మరోసారి బియ్యం రవాణా, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిరంతర నిఘా కొనసాగిస్తామని చెప్పారు. కేసు దర్యాప్తులో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరావు, కానిస్టేబుళ్లు దస్రూ, శ్రీనివాస్ నాయక్, శ్రీనివాసరెడ్డి, నాగయ్య, సైదానాయక్, వెంకటేశ్వర్లు, హోంగార్డు మురళీల పాల్గొన్నట్లు తెలిపారు.

మహిళతో అసభ్య ప్రవర్తన కేసులో ఇద్దరి రిమాండ్

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 23: అస్సోం మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌పాష, పల్లె శ్రావణ్ స్నేహితులు. జాన్‌పాష స్థానికంగా బీపీసీఎల్ టెర్మినల్‌లో పనిచేస్తున్నాడు. టెర్మినల్ జనరేటర్ చెడిపోవడంతో శ్రావణ్‌తో కలిసి ఈ నెల 21న హైదరాబాద్ మోకిలా ప్రాంతానికి గూడ్స్ వాహనంలో వెళ్లారు. రాత్రి 11 గంటలకు తిరిగి వస్తుండగా శంకర్‌పేట వద్ద అస్సోం రాష్ట్రానికి చెందిన వివాహిత(27),ఆమె కుమార్తె(10)తో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెళ్లడానికి ఆటో కోసం నిలబడి ఉంది. ఆమె భర్తతో గొడవపడి అస్సోం వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరింది. ఇదే సమయంలో దండుమల్కాపురం వస్తున్న జాన్‌పాష ఆమెను చూసి ఆటోను ఆపాడు. సికింద్రాబాద్ వెళ్తున్నానని నమ్మించాడు. మాటాలు కలిసాకా ఆ మహిళ తనకు ఉపాధి కావాలని మీ ఏరియాలో పని ఉంటే చేస్తానని చెప్పింది. తమ గ్రామంలో బీపీసీఎల్ పరిశ్రమలో పనికల్పిస్తామని చెప్పి ఆటోను ఓఆర్ఆర్ మీదుగా మల్కాపురం వైపు మళ్లించారు. మార్గమధ్యలో అబ్దుల్లాపూర్ మెట్టు వద్ద ఓ హోటల్‌లో భోజనం చేశారు. అర్ధరాత్రి రెండు గంటలకు మల్కాపురం వద్దకు రాగానే ఆటోను ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లారు. కుమార్తె ఎదుటే మహిళను ఆటో నుంచి కిందకి దింపడానికి యత్నించారు. ఆమెతో ఇద్దరు యువకులు అసభ్యంగా ప్రవర్తించారు. వివాహిత, ఆమె కుమార్తె కేకలు వేయడంతో ఇద్దరు పరారయ్యారు. భయంతో కుమార్తె రోడ్డుపైకి వచ్చి ఓ బైకిస్ట్‌ను ఆపి విషయం చెప్పింది. అదే సమయంలో బైకిస్ట్ వద్ద ఫోన్ తీసుకుని డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను, ఆమె కుమార్తెను రక్షించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ లక్ష్మయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



హుజూర్‌నగర్ హాస్టల్‌లో భోజనం చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

హుజూర్‌నగర్ / చిలుకూరు, ఆగస్టు 23 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం ఓఎస్‌డీ ప్రభాకర్ కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, చిలుకూరు మండలాల్లోని పలు హాస్టళ్లను టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతి గదులు, వంటగది, డైనింగ్ హాల్‌ను, పాఠశాలల ఆవరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. గదుల్లో పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చిలుకూరు మండలంలోని గురుకుల పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలల్లోనూ తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల వివరాలను సేకరించారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్ఐ జంగయ్య, కోదాడ డీటీసీఎస్ రాంరెడ్డి ఉన్నారు. అదేవిధంగా మునగాల మండలం ఆకుపాముల గురుకుల పాఠశాలను పరిశీలించారు.

సన్నబియ్యం నిల్వలో జాగ్రత్తలు పాటించాలి



గుర్రంపోడు బీసీ హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, ఆగస్టు 23: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న సన్నబియ్యం నిల్వలను జాగ్రత్తగా ఉంచాలని నల్లగొండ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి, తేనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుర్రంపోడు మండల కేంద్రంలోని కేజీబీవీ, బీసీ హాస్టల్ తేనెపల్లి, కొప్పోలులో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో బియ్యం నిల్వలను పరిశీలంచారు. బియ్యాన్ని నిల్వ ఉంచే గదిలో వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలని, బియ్యం బస్తాలను గోడలకు తగలకుండా ఉంచాలని సూచించారు. నాణ్యతను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలంలో మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించాలని కోరారు. తేనెపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ చోప్రా, ఎంపీడీవో మంజుల, నకిరేకల్ గోదాం ఇన్‌చార్జి రావుల సైదులుగౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బాలునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 23: వర్షాకాలంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పీఏపల్లి మండలం ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, పారిశుధ్య సిబ్బంది బాధ్యతతో మురుగునీరు గ్రామాల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ట్యాంకులను శుభ్రం చేసి తాగునీరు అందించాలని, మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండగ

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం సూర్యతండాలో తీజ్ (మొలకల) పండుగ ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 9 రోజుల పాటు గిరిజన మహిళలు భక్తి శ్రద్ధలతో తొట్లలో గింజలు వేసి మొలకలు వచ్చేంత వరకు నీరుపోసి సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారని అన్నారు. అనంతరం తీజ్ వేడుకల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో తరగతుల బహిష్కరణ, ర్యాలీ, బస్టాండ్ ఎదుట రాస్తారోకో


బస్టాండ్ ఎదుట విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

దేవరకొండ, ఆగస్టు 23: పెండింగ్‌లో ఉన్న రూ.8వేల 400 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. దేవరకొండలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలల తరగతులను బహిష్కరించి విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదుట నిర్వహించిన రాస్తారోకోలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి కళాశాలలు, పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలని, టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అమితేజ్, కావ్య, పవిత్ర, శివశంకర్, సంతోష్, తులసి, ప్రేమ్‌కుమార్, విక్రమ్, ఆసిస్, వినయ్ పాల్గొన్నారు.

తడకమళ్ల పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 23: మండలంలోని తడకమళ్ల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో శేషగిరిశర్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని నాలుగు తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నందున ఆ గదుల నుంచి విద్యార్థులను నిర్మాణంలో ఉన్న తరగతి గదుల్లో కూర్చోనేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో గ్రామ పంచాయతీ సిబ్బందితో నీటిని తొలగించి శుభ్రం చేయించారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల్లో పెచ్చులు ఊడి విద్యార్థులపై పడే ప్రమాదం ఉన్నందున విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో ఆ గదుల్లో కూర్చోబెట్టకూడదన్నారు. వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు ప్రహరీ వద్ద, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తల ు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్ ఉన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మకు పుష్పాభిషేకం

చిట్యాల, ఆగస్టు 23: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా చిట్యాల కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యాదాద్రి లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారికి ఘనంగా పుష్పాభిషేకం చేశారు. పుష్పాభిషేకం కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుద్ధ విమల, గంజి వెంకటేశం, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు కౌన్సిలింగ్

నాగార్జునసాగర్, ఆగస్టు 23: పెద్దవూర మండల పరిధిలోని పోతునూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులను ట్రాన్స్‌జెండర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరబాబు వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు. ఎవరైనా ట్రాన్స్‌జెండర్లు డబ్బులు వసూలు చేస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

కేతేపల్లి, ఆగస్టు 23: పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారి డి.నాగేశ్వరరావు శుక్రవారం కేతేపల్లిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల పరిశుభ్రతను, మధ్యాహ్న భోజన నాణ్యతలను పరిశీలించారు. అక్కడి విద్యార్థులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యం చెడిపోకుండా గాలి, వెలుతురు సోకే గదిలో భద్రపర్చాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ దీపక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి నరేష్, ఎంపీవో నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

అర్హులైన వ్యక్తులను ఓటరుగా నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్‌వో హరిబాబు

మిర్యాలగూడ, ఆగస్టు 23: అర్హులైన వ్యక్తులను ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఏఈఆర్ఓ హరిబాబు అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలోని 324, 325, 326 అధికరణను అనుసరించి ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని అన్నారు. అందు కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ ఏర్పాటు చేసి బీఎల్వోలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, బీఎల్వో లకు యాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహసీల్దార్ కల్పన, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య, పోలెబోయిన జనార్దన్, అంబటి శ్రీను, రామచంద్రు, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, భాష, ఫణి బూత్ సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జెండా విద్యార్థులకు అండ


జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆంజనేయులు

నాగార్జునసాగర్, ఆగస్టు 23: ఏఐఎస్ఎఫ్ జెండా విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు అన్నారు. సంఘం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సాగర్ హిల్‌కాలనీ బస్టాండ్ ఆవరణలో జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. పోరాటాలే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను, దాడులను అరికట్టేందుకు స్వాంతంత్ర్య స్ఫూర్తితో పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, నాయకులు పవన్, విష్ణు, శ్రీకాంత్, విజయ్, శివశంకర్, వరప్రసాద్, సిద్ధు, రవి, జయ, మానస, శిరీష, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్' ఉద్యోగుల పాలిట శాపం

● టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉపేందర్

నల్లగొండటౌన్, ఆగస్టు 23: సీపీఎస్ విధానం రాష్ట్రంలోని ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని టీఎస్‌సీపీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆగస్టు 23ను సీపీఎస్ ఉద్యోగుల పాలిట చీకటిదినంగా భావిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 28 జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేసి జీవో ప్రతులను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కడుపు మాడ్చుకొని, లాఠీ దెబ్బలు తిని స్వరాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించామన్నారు. నూతనంగా ఏర్పాటైన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు చేపట్టకుండా సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ మనల్ని షేర్ మార్కెట్‌కు తాకట్టు పెట్టారని విమర్శించారు. రహస్యంగా జీవో 28ని జారీ చేసి ఉద్యోగుల మెడకు ఉరితాడు వేసి నమ్మించి గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మహిళా కన్వీనర్ వల్లపుదాసు భూలక్ష్మి, కొరివి కృష్ణ, ప్రవీణ్ సోమనాథ్, అనిల్, శరత్, మచ్చ రఘు, రేణుక, జ్యోతి భద్రయ్య, శ్రీనివాస్, శివకుమార్ సంతోష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

నాగార్జునసాగర్: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంపీడీవో, జడ్పీ హైస్కూల్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆగస్టు 23ను బ్లాక్‌డేగా పరిగణిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జీవో నంబరు 28 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అసోసియేటివ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మురళి, హఫీజ్, సతీష్, రాము, అనిల్‌కుమార్, అరవింద్‌రెడ్డి, రమాదేవి, శ్రీనివాస్, హైమావతి, కలమ్మ, చంద్రమ జీనాగిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రజిత, మునీర్ పాల్గొన్నారు.


నాగార్జునసాగర్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హైడ్రా తరహాలో అక్రమ కట్టడాలను కూల్చాలి

● మట్టి మనుషుల వేదిక కన్వీనర్ పాండురంగారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారావు

మిర్యాలగూడ, ఆగస్టు 23: హైదరాబాద్‌లో హైడ్రా ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను కూల్చినట్లుగానే సాగర్ నుంచి ఖమ్మం జిల్లా వరకు ఎన్నెస్పీ భూముల్లోని అక్రమ కట్టడాలను కూల్చాలని మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బలమైన ప్రజా ఉద్యమంతో కోట్ల విలువైన ఎన్నెస్పీ ఇళ్లు, స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుకోగలిగామని అన్నారు. మరోసారి కబ్జాలకు గురికాకుండా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను సైతం ధిక్కరిస్తూ హైదరాబాద్‌లో ఉండే వారికి సైతం అక్రమంగా ఇళ్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. నాగార్జునసాగర్‌కు సంబంధం లేని నాయకులు, అధికారులు, కలెక్టర్ లాంటి ఐఏఎస్‌లు కూడా దర్జాగా భవంతులు కట్టుకున్నారని ఆరోపించారు. వాటిలో ఏడాదిలో ఒక్కరోజైనా నివాసం ఉండరని పేర్కొన్నారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన రెం డు ఆధిపత్య వర్గాలకు చెందిన ఇద్దరు మంత్రులు కబ్జాలకు కీ లక సూత్రధారులుగా ఉన్నారని అన్నారు. సమైక్యాంధ్రలో లోక్‌అదాలత్, హైకోర్టుల ద్వారా న్యాయపోరాటం చేసి పోలీసుల అండ తో మిర్యాలగూడ ఎన్నెస్పీ క్వార్టర్ల నుంచి కబ్జాదారులను వెళ్లగొట్టినట్లు తెలిపారు. కులాలను అడ్డం పెట్టుకొని న్యాస్థానాలను తప్పుదోవ పట్టించి కబ్జాలో ఉన్న కొందరు, అధికార మార్పిడితో మరికొందరు తిరిగి వక్రమార్గాన కబ్జాలకు యత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. నాగార్జునసాగర్ ఆయకట్టులోని ఆక్రమణలకు గురైన నీటిపారుదల శాఖ భూములలోని అక్రమ కట్టడాలను కూల్చాలని అన్నారు. స్థానిక ప్రజలు సంఘటితమై ప్రభుత్వ స్థలాలు, భవనాల రక్షణకు మరోసారి ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. సమావేశంలో మట్టి మనుషులు డేగ వీటి, ఇంద్రపల్లి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

● డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

కనగల్, ఆగస్టు 23: సేంద్రీయ ఎరువులను వాడి అధిక దిగుబడులను సాధించాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి కోరారు. మదర్‌థెరిస్సా గ్రామీణాభివృద్ధి సంస్థ (నార్కట్‌పల్లి) సౌజన్యంతో కనగల్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కనగల్ ఎక్స్‌రోడ్డులోని రైతువేదికలో సేంద్రీయసాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, ఎంటీఆర్డీఈఎస్ జర్మనీ ప్రతినిధి జార్జ్, జూనియస్ పొలిశెట్టి, ఏఈవో విజయలక్ష్మి, రైతు నాయకుడు అంజయ్య, మాజీసర్పంచులు రాము, పార్వతమ్మ జానయ్యగౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలి

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా జీఎడవల్లి గ్రామంలో స్థానిక అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తుందన్నారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత, ఏపీవో సుధాకర్, టీఏ మహేశ్వరం రమేష్, కార్యదర్శి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

● పీఏసీఎస్‌కు నిత్యం దిగుమతి

నిడమనూరు, ఆగస్టు 16: నిడమనూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంతో పాటు పలు ఎరువుల దుకాణాల్లో ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. యూరియా కోసం అన్నదాతల పరుగులు అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. ఈ మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యూరియా నిల్వలను పరిశీలించారు. మిగతా ఎరువుల మాదిరిగానే యూరియాను కూడా తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సొసైటీలో రైతులకు అందిస్తున్న యూరియా వివరాలు తెలుసుకున్నారు. వానాకాలం సీజన్‌లో వరి సాగు పెరగడంతో రైతుల అవసరాల మేరకు యూరియాను అందించాలని సూచించారు. దీంతో ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో 150 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అదేవిధంగా పీఏసీఎస్ గోదాములో కూడా నిత్యం యూరియా దిగుమతి చేసుకుంటున్నారు. అవసరమైన మేరకు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ కాల్వలకు నీటిని విడుదల చేశారు. దీంతో సీజన్‌లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. నిడమనూరు సొసైటీ పరిధిలోని రైతాంగానికి ఈ సీజన్‌లో సుమారు రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. సొసైటీలో ఇప్పటివరకు 722 టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. సీజన్‌లో రైతులకు అవసరమైన మేరకు యూరియాను తెప్పిస్తున్నామని, ఎలాంటి కొరత లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో ముని కృష్ణయ్య తెలిపారు.

మంత్రి వెంకట్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం : కాంగ్రెస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఆగస్టు 23: నిరంతరం ప్రజల కోసం పాటుపడే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆక్రమణ, కూల్చివేతకు సంబంధించి చర్యలు అధికారులు తీసుకుంటారని అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మంత్రి వెంకట్‌రెడ్డిని నోటికి వచ్చినట్లు, వ్యక్తిగతంగా విమర్శించడం తగదని అన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను ఇకపై చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండలో ఒక్క రోడ్డు తప్ప చేసింది ఏమీ లేదని వారు విమర్శించారు. ప్రతీ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు, రోడ్లు, వరదకాల్వలు ఏర్పాటు చేసింది మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డేనని అన్నారు. సొంత నిధులతో కూడా మంత్రి వెంకట్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా కంచర్ల భూపాల్‌రెడ్డి తన భాష మార్చుకోవాలని లేనిచో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో తిప్పర్తి, నల్లగొండ, కనగల్ మాజీ జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూసర్వే


చింతలపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 23: మండలంలోని చింతలపాలెం గ్రామ శివారులోని సర్వే నెంబర్ 22, 222, 223లలో సర్వేయర్ ఏడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూసర్వే చేపట్టారు. ప్రభుత్వం భూ సమస్యలపై తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని చింతలపాలెం గ్రామ శివారులోని భూములను సర్వే చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఉన్న ప్రతి సర్వే నెంబర్‌కు సర్వే టీం వస్తుందన్నారు. ఖాస్తు, కబ్జాలో ఉన్న రైతులంతా సహకరిస్తే భూసర్వే చేయడానికి వీలవుతుందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్, నాయకులు బూడిద పాండురంగా, జటావత్ పరమేష్, రైతులు అంజి, లింగయ్య, ఏసు, దశరద్, సర్వేయర్ హరీష్, లింగస్వామి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శాలిగౌరారం, ఆగస్టు 23: సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి సూచించారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆమె ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉంటే దోమలకు, ఈగలకు చేరి మనకు హాని తలపెడుతాయన్నారు. కొబ్బరి చిప్పలను, టైర్లను ఇంటి పరిసరాల్లో లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె వెంట ఎంపీవో పద్మ, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మోలుగూరి భాస్కర్, ఆశా వర్కర్ బెల్లం నవనీత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

చిట్యాల, ఆగస్టు 23: ఎలాంటి షరతులు విధించకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాలలోని రైతు వేదిక వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రెండు లక్షల లోపు రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరారు. ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా మాఫీ వర్తించలేదన్నారు. రుణాలు మాఫీ చేసి త్వరితగతిన కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఏఈవో మనీషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట సరోజ, లింగస్వామి, రాజయ్య, లక్ష్మీనారాయణ, రాములు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖరరావు

మిర్యాలగూడ టౌన్, కట్టంగూరు, నార్కట్‌పల్లి, గట్టుప్పల్, ఆగస్టు 23: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు డివిజన్‌లోని విద్యాలయాల్లో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.శ్రీను, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఏపీఎం చెరుకు సైదులు, ఏపీవో కడియం రాంమోహన్, కార్యదర్శి వడ్లకొండ అశోక్, శంకర్, వెంకన్న, మల్లేశ్వరీ, చైతన్య, అంజమ్మ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సమభావన సంఘాల మహిళలతో గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్, డీపీఎం, ఏపీఎం శ్రీదేవి, ఆరోగ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న యువత ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని అన్నారు. మండలపరిధిలోని అంతంపేట గ్రామంలో విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రత విషయంలో ఎలాంటి ఆటంకం కలిగించకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు హనుమంత్, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

నాగార్జునసాగర్, ఆగస్టు 23: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిం బూరుగ సైదులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆరోగ్యశ్రీ సిబ్బందిని కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 సంవత్సరాలుగా పీజీ, డిగ్రీలు కలిగి ఉన్న 900 మంది ఆరోగ్యమిత్రలు 24 గంటలకు పనిచేస్తున్నా కనీస వేతన చట్టం అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులకంటే తక్కువ వేతనంతో ఆరోగ్యమిత్రలకు పని చేస్తున్నారని అన్నారు. ఆరోగ్యమిత్రలకు డేటా ఎంట్రీ ఆఫీసర్ క్యాడర్ కల్పిస్తూ జీవో నంబరు 60 ప్రకారం రూ.22,750 వేతనం చెల్లించాలన్నారు. టీఏ, డీఏలను కూడా అమలుచేయాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో మధుసూధన్, ఆరోగ్యమిత్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దామరచర్ల: మండలంలోని 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ వేయడం జరుగుతున్నందున శనివారం 33 కేవీ రాళ్లవాగుతండా ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు. కావున విద్యుత్ వ్యాపార, వాణిజ్య, గృహ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నార్కట్‌పల్లి: మండలంలోని చిప్పలపల్లి కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహకార శాఖ పర్యవేక్షణాధికారి దశరథ సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా పనసం వాసుగౌడ్, ఉపాధ్యక్షులు బత్తిని రమేష్, కార్యదర్శి ధనుంజయ, డైరెక్టర్లుగా రామనర్సయ్య, జీడికల్లు, చిన్నశేఖర్, కరుణాకర్ ఎన్నికయ్యారు.

చిట్యాల రూరల్: మండలంలోని ఉరుమడ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. రాకెట్ల ప్రయోగం, ఉపగ్రహాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్కే లతీఫ్, రజిత, సైదులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి అన్నారు. కట్టంగూరులో ఆయన పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి శివశంకర్, గోశిక అంజన్‌కుమార్, మర్రి రాజు, లక్ష్మయ్య, గణేష్ పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడుతున్నారని పట్టణానికి చెందిన ఆర్.వంశీమోహన్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంతో పాటు శివారుల్లో ప్రభుత్వ భూములను కొంతమంది కౌన్సిలర్లు, వివిధ పార్టీల నేతలు కబ్జాలు చేసుకొని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని అన్నారు. మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు భూకబ్జాదారులపై చర్య తీసుకొని అక్రమ కట్టడాలను నిలిపివేయాలని కోరారు.

శాలిగౌరారం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన యాదగిరిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంతలో నాయకులు బాకీ వెంకటయ్య, బోడ నర్సయ్య, మల్లయ్య, లింగయ్య, శ్రీను, మల్లయ్య, శంకర్, రఘురాం, అరుణ్, అంబేద్కర్, ఉదయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, మాధవి, పద్మావతి, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

చండూరు రూరల్: వెల్మకన్నె ఫీడర్ చానల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీడర్ చానల్ వెల్మకన్నె గ్రామం నుంచి కల్వకుంట్ల మీదుగా కొండాపురం బెండలమ్మ చెరువు వరకు ఉంటుందని అన్నారు. మండలంలోని కొండాపురం, పుల్లెంల, బోడంగిపర్తి గ్రామాల్లోని వందల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు.

దామరచర్ల: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలోని హైదరాబాద్ స్కూల్ యాజమాన్యం 35 మంది నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల నుంచి కొత్తగా అడ్మిషన్లు తీసుకొని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాఠశాలకు తాళం వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో పెద్ద మొత్తంలో నగదు సేకరించిన యాజమాన్యం పాఠశాలను మూసివేసింద న్నారు. తక్షణమే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు, టీచర్లు లక్ష్మీనారాయణ, గ జేష్, కుమార్, సాంబా, మేష్యానాయక్, పద్మ, అనిత పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాసం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమార్చనలు అభిషేక పూజలను జరిపించి చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కొండమల్లేపల్లి: జాతీయ అంతరిక్ష మొదటి దినోత్సవవం సందర్భంగా కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో అంతరిక్షంలో దేశం సాధించిన ప్రగతిని తెలియజేస్తూ ఫొటో ఎగ్జిబిషన్‌ను హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కొండమల్లేపల్లి: 2024-25 సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కొండమల్లేపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రమావత్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. దూరవిద్యలో చదువును కొనసాగించడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కట్టెల పొయ్యిపై కాకుండా గ్యాస్ సిలిండర్‌పై వంట వండేందుకు గ్యాస్ సిలిండర్‌ను దేవరకొండ డీటీసీఎస్పో హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పెద్దవూర డీటీసీఎస్ ముక్తార్, హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: విద్యార్థులు యువత క్రీడారంగంలో రాణిస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని కుర్మపల్లి జడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వంహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో గురువారావు, సంజీవరెడ్డి, యాదగిరి, వెకటయ్య, హరినాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథ దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష గాజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, కుమారిశెట్టి వెంకటయ్య, కృష్ణయ్య, పుల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.